నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
శనివారం 18, మే 2024




## బాలల హక్కులు, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల




4 లో..

# అరణ్యంలో... అడవి బిడ్డలు

- అందని సంక్షేమ ఫలాలు!!
- కష్టాలతో సావాసం!
కనెత్తి చూడని అధికార ఘనం!!
- పాతికేళ్ళు గా దరిచేరని విద్యా, వైద్యం, విద్యుత్
- మినీ అంగన్వాడీ సైతం నోచుకోని దౌర్భాగ్యం
- ఓట్లకోసమే తప్ప కన్నెత్తిచూడని ప్రజాప్రతినిధులు
- రాళ్లచెరక గుంపు ప్రజల ఇక్కట్లు పై "సూర్య" ప్రత్యేక కథనం





2 లో..

కొత్తగూడెం, సూర్య (మేజర్ న్యూస్) - ఆధునిక యుగంలో నాగరికత వైపు అడుగులు వేసి అంతరిక్షంలో విహరిస్తుంటే కొందరు మాత్రం బాహ్య ప్రపంచానికి దూరంగా ఇంకా ఆడవితల్లినే నమ్ముకొని జీవనం సాగిస్తూ కష్టాలతో సావాసం చేస్తూ మనుగడ సాగిస్తున్నారు. అభివృద్ధి కి దూరంగా, అనాగరికులుగా బ్రతుకును వెల్లదీస్తున్నారు. సుమారు పాతికేళ్ళ క్రితమే ఆరణ్యానికి చేరువయ్యారు. అడవితల్లి పై మక్కువతో పోడు వ్యవసాయం చేస్తూ వరి, ప్రత్తి పండిస్తున్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- వాటర్ ప్లాంట్ నిర్మిస్తే ఉపయోగమెవరికి ???
- రోడ్ల విస్తరణలో చాల నష్టపోయాం
- మాజీ కౌన్సిలర్ లక్ష్మీబాయి, స్థానికులు



4 లో..

## పాక వేసుకో.... పన్ను తీసుకో....



- మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల పందేరం
- ఆక్రమణదారులకు సహకరిస్తున్న అధికారులు
- క్షేత్రస్థాయి పరిశీలన నిల్..... అధికారి జేబు ఫుల్
- మండల కేంద్రంలో కనుమరుగు కానున్న ప్రభుత్వ భూములు
- ఆలయాలకు కేటాయించిన భూములను కబ్జా చేస్తున్న ఘనులు
- సమాచార దరఖాస్తు కూడా స్పందించని వైనం



2 లో..

# అరణ్యంలో ఆడవిబిడ్డలు!

ఇప్పపువ్వు, చింతపండు లాంటి అడవి ఉత్పత్తులను సేకరిస్తున్నారు. 2 కిలోమీటర్లు దూరం నుండి చెలమల్లో నీటిని సేకరించి తాగుతూ, పశు పక్షాదులతో కాలం వెళ్లదీస్తూ, గుడ్డిదీపాలతో, సౌకర్యలకు దూరంగా పెదరికన్ని అనుభవిస్తున్నారు. సుమారు నేడు 200 ల మంది ఉన్న ఆ గ్రామంలో ఇప్పటికి సరైన రహదారి లేక, విధ్యా, వైద్యం, విద్యుత్ అందక ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా, ప్రజా ప్రతినిధులు మారినా ఎప్పటికైనా వారి తలరాతలు మారుతాయనే గుడ్డి నమ్మకంతో ప్రభుత్వ సాయం కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు. వృక్షాలను ఆసరా చేసుకొని 40 డిగ్రీ ల ఎండలో గుంపు గా సేద తీరుతున్న అమాయక ఆదివాసీల ను పలకరించింది సూర్య బృందం. జనాలను వీడి వనంలోకి బయలెల్లిన వీరి పాతికేళ్ళ ప్రయాణాన్నీ.. జీవన స్థితిగతులను తెలుసుకునే ప్రయత్నం చేసింది. రోజు రోజుకు పెరుగుతున్న ఆధునీకరణ, సాంకేతిక సదుపాయాలను కాదని, అరణ్యం లో జీవనం గడుపుతూ 2024 లోకూడా 1980 నాటి జీవనాన్ని కొనసాగిస్తున్నారు అక్కడి ఆదివాసీ గొత్తి కోయలు.పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు అన్నాడు మహాత్ముడు. కానీ అటువంటి ఆదివాసీ గ్రామం ప్రస్తుతం పాలకులచే నిర్లక్ష్యానికి గురవుతుంది. తెలంగాణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం లోని రాళ్లచెరక గుంపు గ్రామ ఆదివాసీలు సుమారు పాతికేళ్ళ క్రితం బ్రతుకు దెరువుకు వలస వెళ్లారు. రెండు కుటుంబాలతో ప్రారంభమై వారి ప్రస్థానం నెడది 40 కుటుంబాలు గా ఏర్పడి సుమారు 200 ల జనాభాకు చేరువైంది. ప్రపంచం నలుమూలల నుండి క్షణాల్లో వాట్స్ అప్ ద్వారా, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం అందుకుంటున్న నేటి తరుణంలో ఎవరైనా వెళ్లి సమాచారం ఇస్తే తప్ప తెలుసుకోలేని దీన వ్యవస్థలో నేటికి బ్రతుకులు వెల్లదీస్తున్నారు అక్కడి ఆదివాసీలు.

**–వైద్యం అందక ఇబ్బందిపడుతున్నాం...**

**–రహదారి, మౌలిక సదుపాయాలు కల్పించండి.**

అనారోగ్యం పాలైతే వైద్యం కోసం తీవ్ర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన రోడ్డు మార్గం లేక ఆసుపత్రికి చేరుకోవాలంటే వారికి డోలీ లేదా ద్విచక్ర వాహనమే దిక్కు. గర్భిణీలు, వృద్ధులను 5 కిలో మీటర్ల మేర మోసుకెళ్లి అక్కడినుండి పాల్వంచ, కొత్తగూడెం పట్టణ ప్రాంతాలకు వెళ్లి వైద్యం అందించాల్సిన పరిస్థితి. అడవి ప్రాంతం కావడంతో నిత్యం విష ప్రాణులు సంతరించడంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బ్రతికు వెల్లదీస్తున్నామని, తమకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే, ప్రాణాపాయ సమయాల్లో 108 వాహనం రావడానికి వీలుగా ఉంటుందని, రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, తమ ప్రాణాలు నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వర్షకాలం వచ్చిందంటే విషజ్వరాలు వచ్చి ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందేనని, తమకు కనీస వైద్యసౌకర్యాలు అందుబాటులో ఉండవని ఆడవిబిడ్డలు ఆవేదన చెందుతున్నారు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చంటి పిల్లలకు పౌష్టికాహారం పొందేందుకు సైతం పక్క గ్రామానికి వెళ్లాల్సి వొస్తునందున తమ గ్రామంలోనే మినీ అంగన్వాడి సెంటర్ ను ఏర్పాటు చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. రహదారి సరిగ్గా లేకపోవడంతో తమ గ్రామాన్ని సందర్శించేందుకు అధికారులు సైతం సుముఖత చూపడం లేదని అడవి బిడ్డలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తమను గుర్తించి కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.





**–దరిచేరిని ప్రభుత్వ సంక్షేమ పథకాలు**

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా తమ బతుకులు మారలేదని ఆదివాసీలు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయం చేసుకొని జీవనం సాగించడంలో భాగంగా కొన్ని కుటుంబాలు 25 ఏళ్ళ క్రితం రాళ్ళ చెలక గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. నేడది సుమారు 200 మంది జనాభాతో మౌలిక సదుపాయాలకు దూరంగా జీవనాన్ని సాగిస్తున్నారు. నేటికీ వీరికి విద్యా.. వైద్యం...విద్యుత్ ను అందించడంలో అధికారులు పూర్తి వైఫల్యం చెందారు. నేటికి విద్యుత్ సదుపాయం లేక గుడ్డి దీపాలతో బ్రతుకెళ్లదీస్తున్నారు. వృద్ధులకు పెన్షన్లు అందివ్వడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. తమ గ్రామం ఊరికి దూరంగా ఉండటంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలాంటి సంక్షేమ పథకాలు తమకు అందడం లేదని వృద్ధులకు పెన్షన్లు, పలు కుటుంబాలకు రేషన్ కార్డులు, ఆరోగ్య భీమా కార్డులు, తమ పిల్లలకు మెరుగైన విద్య అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. రెషన్ కార్డులు ఉన్న కొందరు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేగులగూడెం గ్రామానికి వెళ్లాల్సి వొస్తుందని తెలిపారు.







**–ఇన్నేళ్లకు ఒక్కబోరు....పనిచేయని సోలార్ బల్బులు...**

ఇన్నేళ్లుగా రెండు కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి చలమల్లోని నీటిని తెచ్చుకుంటున్న ఆదివాసీలకు ఇటీవలే గ్రామంలో బోర్ వేసి ఒక చేతి పంపును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయినప్పటికీ ఉన్న జనాభా అవసరాల దృష్ట్యా మరో రెండు చేతి పంపులు ఏర్పాటు చేయాలని ఆడవిబిడ్డలు కోరుతున్నారు. గతంలో ప్రభుత్వం సోలార్ బల్బులు పలువురుకి అందించినప్పటికి అవన్నీ పనిచేయక నేడు మూలన పడడంతో కిరోసిన్ దీపాలతోనే కొద్దిపాటి వెలుగును పొందుతున్నామని ప్రభుత్వం కరెంట్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

**–ఓట్లకోసమే తప్ప కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు....**

గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న జీవనస్థితిగతులు నేటి తెలంగాణ రాష్ట్రంలోనూ అలాగే కొనసాగుతున్నాయని ఆదివాసీలు అంటున్నారు. ఓట్లకోసమే తప్ప మౌలిక సదుపాయాల కల్పించడంలో ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. ఎన్నికలు వొచ్చినపుడు ప్రధాన పార్టీల అభ్యర్ధులు ఓట్లకోసం తమ ప్రాంతానికి వొస్తారని, తమ బ్రతుకులు మారుస్తామని, సదుపాయాల కల్పనకు కృషిచేస్తామని, ప్రభుత్వ ఫలాలను అందిస్తామని వాగ్దానాలిచ్చి తరువాత మొఖం చాటేస్తారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ప్రాంతాన్ని గ్రామంగా గుర్తించి విద్య, వైద్యం, విద్యుత్, రహదారి సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఫలాలు తమకు అందచేయాలని రాళ్లచెరక గుంపు అడవి బిడ్డలు కోరుతున్నారు.

## పాక వేసుకో.... పన్ను తీసుకో.......




చర్ల, సూర్య (మేజర్ న్యూస్)– సొంత ఇంటి స్థలం లేని కొందరు నిరుపేదలు కూలీనాలీ చేసుకుని అద్దె ఇళ్లలో నిజాయితీగా బతుకు పోరు కొనసాగిస్తుంటే సొంత ఇళ్ళు ఉన్నాకూడా కొందరు అత్యాశాపరులు కొందరు అవినీతి అధికారుల అండదండలతో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే చర్ల మండల కేంద్రంలో నానాటికి భూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ భూములు కనబడితే చాలు కబ్జా చేస్తున్నారు. నాలుగు సిమెంట్ స్తంభాలు, నాలుగు రేకులతో ఒక పాక వేసి అధికారుల అండదండలతో నో అబ్జెక్షన్ పత్రం పొంది స్థలం మాది అనిపించుకుంటున్నారు. మండల కేంద్రంలోని ఆయిల్ బంక్ ఏరియా వద్దనున్న సింహద్వారం దగ్గర నుండి లక్ష్మీ కాలనీ వరకు గల 117 సర్వేనెంబర్ భూమిలో కబ్జాదారులు విచ్చలవిడిగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. గుట్ట కనపడితే చాలు గుట్టుగా తవ్వేసి చదును చేసి కబ్జా చేస్తున్నారు. ఆలయాలకు కేటాయించిన భూములను కూడా సబ్జా చేసి దర్జాగా ఇల్లు కట్టేస్తున్నారు. కబ్జాదారులకు గ్రామపంచాయతీ అధికారులు అండదండలు అందిస్తున్నారని, క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా కార్యాలయంలో కూర్చొని తమకు నచ్చిన వారికి అక్రమ మార్గంలో ధ్రువపత్రాలను మంజూరు చేస్తూ జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ కబ్జాల విషయమై గ్రామపంచాయతీ నుండి జారీచేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ల వివరాలను కోరుతూ స్థానికుడొకరు గ్రామపంచాయతీ కార్యాలయంలో, విద్యుత్ శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేయగా గడువు ముగిసినప్పటికీ సమాచారం ఇవ్వడంలో రెండు శాఖల అధికారులు జాప్యం చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**–క్షేత్రస్థాయి పరిశీలన నిల్....... జేబులు ఫుల్**

గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం ఎవరైనా ఇంటి నిర్మాణం చేపడితే ముందుగా గ్రామపంచాయతీ నుండి అనుమతులు పొంది ఇల్లు కట్టవలసి ఉండగా చర్ల మేజర్ గ్రామపంచాయతీ, లక్ష్మీ కాలనీ గ్రామపంచాయతీలలో గృహాలు నిర్మిస్తున్న వారికి అలాంటి నిబంధనలు ఏమీ వర్తించడం లేదు. అధికారులకు ఆమ్యామ్యాలు ఇచ్చి నిబంధనలకు వ్యతిరేకంగా గృహాల నిర్మాణాలు చేపడుతున్నారని సమాచారం. ఇందుకు నిదర్శనం మండల కేంద్రంలో వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలే నిదర్శనం. వన్ ఆఫ్ సెవెంటీ చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడం విరుద్ధం కానీ మండల కేంద్రంలో ఈ మధ్యకాలంలో విరివిగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తుడడంతో చర్యలు తీసుకోవలసిన అధికారులు లంచాలు తీసుకొని చూసి చూడనట్లుగా పోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి పన్ను కోసం కానీ, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం కానీ గ్రామపంచాయతీ అధికారులకు దరఖాస్తు చేస్తే వారు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆ ఇంటి స్థలం సంబంధిత వ్యక్తులకు ఎలా సంక్రమించింది అనే వివరాలు తెలుసుకొని మాత్రమే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేయవలసి ఉండగా అవేమీ లేకుండా కబ్జాదారులు ప్రభుత్వ భూములలో వేసిన నివాసయోగ్యం కాని పాకలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు మంజూరు చేసారు. వీటితో కబ్జాదారులు ఎంచక్కా కరెంటు మీటర్లు సైతం తీసుకున్నారు.

**–కనుమరుగు కానున్న ప్రభుత్వ భూములు**

కబ్జాలు ఇలాగే కొనసాగుతూ పోతే కొంతకాలం తర్వాత చర్ల మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి అనేది లేకుండా పోతుందని ప్రభుత్వం తరపున అభివృద్ధి పనులు చేపట్టాలన్నా స్థలం కరువైపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములును కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులకు అండదండలు అందిస్తూ తమ తాత గారి ఆస్తిలా ప్రభుత్వ భూములకు ఇష్టానుసారం ధ్రువపత్రాలను మంజూరు చేయడంపై మండల కేంద్రంలోని ప్రజలు మండిపడుతున్నారు. కాగా ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారు నిరుపేదలు కాదని ఇల్లు లేని వారు కాదని వారికి సొంత స్థలం, ఇల్లు, వ్యవసాయ భూములు ఉన్నాయని సమాచారం. అన్నీ ఉన్నవారే కక్కుర్తి పడి కబ్జాలు చేసుకుంటూ పోతే ఇల్లు లేని నిరుపేదల పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న భూకబ్జాలపై జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టి ప్రభుత్వ భూములలో ఆక్రమణలను తొలగించి ఆ భూములకు ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టాలని కోరుతున్నారు.

# ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**- అదనపు కలెక్టర్ వేణుగోపాల్**

కొత్తగూడెం, సూర్య (మేజర్ న్యూస్)–ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శనివారం ఐ డి ఓ సి లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొత్తగూడెం జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు అవుతాయని, నిర్ణీత తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు ముందుగానే చేరుకోవాలని ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాలలోకి సెల్ ఫోన్ లు, స్మార్ట్ వాచ్ లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు తాగునీరు అందుబాటులో వుంచాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్నటువంటి జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆయన ఆదేశించారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 5408 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2,726 మంది విద్యార్థులు హాజరు కానున్నారని అదనపు కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచన రాణి, జిల్లా వైద్య శాఖ అధికారి శిరీష, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**- విద్యుత్ శాఖ ఏఈ ఎంఎల్ నర్సింహారావు**



చంద్రుగొండ, సూర్య(మేజర్‌న్యూస్)– నేడు మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ మరమత్తుల దృశ్య విద్యుత్ సరఫరాలో అంతర ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ ఎంఎల్ నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం 33/11 కెవి పోకలగూడెం ఉపకేంద్రంలో మరమ్మత్తును దృష్టిలో పెట్టుకొని ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పోకలగూడెం, గానుగపాడు, రేపల్లెవాడ, తుంగారం, సుంకర బంజర, అన్నారం తండా, మంగయ్య బంజర, బాల్య తండా, వెంకట్యా తండా, వంక నెంబర్, సామ్యా తండా, కరిసెల బోడు, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. కావున ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## రైతు మరణిస్తే 24 గంటల్లోపు సమాచారం ఇవ్వాలి

చర్ల, సూర్య (మేజర్ న్యూస్)–రైతు బీమా పథకంలో ఉన్న 59 సంవత్సరాలలోపు రైతులు ఎవరైనా మరణిస్తే ఆ సమాచారాన్ని 24 గంటల లోపు వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని చర్ల వ్యవసాయ శాఖ అధికారి శివరాం ప్రసాద్ తెలిపారు. కుటుంబానికి పెద్ద దిక్కైన రైతు మరణిస్తే ఆ కుటుంబానికి ప్రభుత్వం రైతు బీమా ద్వారా అందించవలసిన సహాయం పొందడానికి రైతు మరణించిన 24 గంటల్లోపు సమాచారం తెలియపరచాలని లేదంటే క్లైమ్ కూడా ఆలస్యం అవుతుందని ఆయన తెలిపారు. 24 గంటల్లోపు సమాచారం తెలిపితే రైతు భీమా సొమ్ము వారం రోజుల్లోనే రైతు కుటుంబానికి అందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమాచారం తెలియక కొంతమంది రైతుల కుటుంబ సభ్యులు రైతు మరణించిన విషయం ఆలస్యంగా సమాచారం అందిస్తున్నారని వారికి భీమ సొమ్ము అందడంలో నెలల తరబడి జాప్యం అవుతుందని ఆయన అన్నారు.



# ప్రభుత్వంలో ఉన్న లేకపోయినా ప్రశించే గొంతుకకు మారుపేరు తీన్మార్ మల్లన్న

**-పట్టభద్రులంతా అత్యధిక మెజార్టీతో తీన్మార్ మల్లన్నను గెలిపించండి.**

**- శాసనసభ్యులు కోరం కనకయ్య.**

ఇల్లందుటౌన్, సూర్య (మేజర్‌న్యూస్)– ప్రపంచంలో ఎవరూ చేయలేని విధంగా వున్న తన ఆస్తి రెండు కోట్లను ప్రభుత్వానికి అందజేసిన తీన్మార్ మల్లన్న ప్రపంచ కుబేరులందరికీ ఆదర్శంగా నిలబడ్డాడని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో పాల్గొన్న కనకయ్య మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉన్న లేకపోయినా ప్రజల వైపు ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను ఈనెల 27న జరిగే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను పట్టపదులంతా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గతంలో పట్టభద్రులంతా బిఆర్ఎస్ పార్టీ నుండి శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేసిన పల్లా రాజేశ్వర్ రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రుల ఆశలను నిరాశలు చేస్తూ డబ్బు సంపాదనే ధ్యేయంగా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఎమ్మెల్యేగా నిలబడ్డాడని తెలిపారు. ఇండిపెండెంట్గా ఎమ్మెల్సీగా పోటీ చేసిన తీన్మార్ మల్లన్న టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని, ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి ని ముచ్చెముటలు పట్టించి పల్లా రాజేశ్వర్ రెడ్డి పై స్వల్ప తేడాతో ఓడిపోయాడని తెలిపారు. ఇలాంటి మంచి తరుణంలో తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ పార్టీ తరఫున మంచి అవకాశం లభించిందని విద్యావంతుల ఆవేదనను, ఆశలను ప్రభుత్వానికి గట్టిగా వినిపించే తీన్మార్ మల్లన్న ప్రభుత్వానికి పట్టభద్రులకు వారిదిగా ఉండి న్యాయం చేసే తీన్మార్ మల్లన్నకు రాష్ట్రంలో ఏ ఎమ్మెల్సీకి రానంత మెజార్టీని తీసుకురావాలని పట్టభద్రులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ డేనియల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి సైదులు, ఇల్లందు ప్రముఖ విద్యావేత్త ఎం. సి. నాగిరెడ్డి, మహబూబాద్ జిల్లా తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ పొలిటికల్ ఇంచార్జ్ సందీప్ గౌడ్,తెలంగాణ రాష్ట్ర పోరాట విద్యావంతులవేదిక నాయకులు ఎం రమేష్,విద్యాసాగర్, గుండాల డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ వరలక్ష్మి, పులిగండ్ల గంగ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోళ్ళ సూర్యం, మడుగు సాంబమూర్తి,గోచుకొండ సత్యనారాయణ, అడ్వకేట్ సువర్ణపాక సత్యనారాయణ, ఇబ్రహీం, లెక్చరర్ వీరస్వామి, మాజీ కౌన్సిలర్ రవి, ఇటుక బట్టీల వెంకన్న సార్, తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ తోనే దేశ సమగ్రత, రాజ్యాంగ రక్షణ పదిలం

**-కాంగ్రెస్ గెలుపు దేశాభివృద్ధికి మలుపు**

**- కాంగ్రెస్ నేత మున్సిపల్ కౌన్సిలర్ వై. శ్రీనివాస్ రెడ్డి**

**-భారీ మెజారిటీతో రఘురామిరెడ్డి గెలుపు తథ్యం**

కొత్తగూడెంఅర్బన్,సూర్య (మేజర్‌న్యూస్)– దేశానికి స్వతంత్రం సాధించిన పార్టీ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, కాంగ్రెస్ తోనే దేశ సమైక్యత సమగ్రత రాజ్యాంగ రక్షణ పదిలంగా ఉంటాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్ వై. శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని కూలీలైన్ 23వ, వార్డ్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో మిత్ర పక్షాలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన జోష్యం చెప్పారు. దేశంలో సోనియా గాంధీ,రాహుల్ గాంధీ సారధ్యంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి జిల్లాలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , మల్లు భట్టి విక్రమార్క , తుమ్మల నాగేశ్వరావు ల కృషితో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా నిలబడి ప్రజా సంక్షేమం, అభివృద్ధిని కొన సాగిస్తు.. ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరిహరన్, కాకటి సందీప్, కుంట రవీందర్, కమిటీ కార్ కిరణ్, మహంకాళి నారాయణ, చేకూరి రాజకుమారయ్య, బొమ్మ లూరీ రాజేంద్రప్రసాద్, కొండపల్లి కోటయ్య, రాము, నాగయ్య, కృష్ణ, శ్రీనివాస్, బొల్లం చంద్రమౌళి, శ్రీకాంత్, ఖదీర్, అనిల్, గోపి, రఘు, లక్ష్మణ్, సత్యనారాయణ, నజీర్, శంకర్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



**చంద్రుగొండ, సూర్య (మేజర్ న్యూస్)–** శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331 ఆరాధన మహోత్సవం అయ్యన్నపాలెం త్రిమూర్తుల ఆలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు కృష్ణమాచారి రామలింగేశ్వర చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సోము కృష్ణమాచారి, వారాధి రామాచారి, వెంకటాచారి, రవీందర్ రెడ్డి, నున్న వెంకటేశ్వర్లు, కిరణ్, శ్రీనివాసరెడ్డి, మెకానిక్ చారి, మల్లెం వెంకటేశ్వర్లు, అయ్యన్నపాలెం భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



కొత్తగూడెం టౌన్,సూర్య (మేజర్ న్యూస్)–కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు లో ఆ వార్డు కౌన్సిలర్ మినీ వాటర్ స్కీం ద్వారా ఇండియన్ గ్యాస్ గాజుల రాజం బస్తీ రోడ్డు మూల మలుపు వద్ద నీటి బోరును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బోరు విషయంలో రోడ్డు సమీప మార్గంలో ఉన్న ఇండ్లకు మునుముందు రోజుల్లో ఇబ్బంది అవుతుందని మాజీ కౌన్సిలర్ లక్ష్మీబాయి, స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో రోడ్డు విస్తరణ మార్గంలో ఈ రోడ్డు వెంబడి ఉన్న ఇల్లు వారి ఇంటి ముందు ఉన్న భూమిని కొంతమేరకు కోల్పోవడం జరిగిందని స్థానికులు చెప్తున్నారు. ఇప్పుడు ఇక్కడ నిర్మించిన బోరు దానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటుచేసిన రూము వలన మునుముందు రోజుల్లో ఆ ఇండ్ల ముందు రోడ్డు అవతల వైపు నిర్మించడం వలన మళ్లీ ఈ రోడ్డు నిర్మాణ క్రమంలో గవర్నమెంట్ నుండి ఏర్పాటుచేసిన మినీ వాటర్ స్కీము దానికి సంబంధించిన రూమును గవర్నమెంట్ వారు నిర్మిస్తున్నారు. మళ్లీ రోడ్డు విస్తరణ జరుగుతుందేమో అని భయంతో తమ ఇండ్ల ముందు నిర్మించే ఈ బోరు, దానికోసం విద్యుత్ సౌకర్యం కోసం నిర్మిస్తున్న రూము వలన మళ్లీ తమ ఇళ్లకు ఇబ్బంది జరుగుతుందని వారు దీనిని మరొక స్థలానికి మారవలసిందిగా కోరుతున్నారు. ఎందుకంటే ఈ బోరు నిర్మించే ప్రదేశము గతంలో ఉన్న బోరును మున్సిపల్ అధికారులు తొలగించారు. ఎందుకంటే కొత్తగూడెం మున్సిపాలిటీ మొత్తం డ్రైనేజ్ వాటర్ అన్ని వార్డుల నుండి ఈ బోరు సమీప నుండి ఇండియన్ గ్యాస్ గోడం ఎదురు నుండి స్మశాన వాటిక నుండి బయటకు పంపిస్తారు. గతంలో ఇప్పుడు నిర్మిస్తున్న బోరు పక్కన ఉన్న బోరు లో నుండి కాలువ నుండి వచ్చే మురుగునీరు రావడంతో మున్సిపల్ అధికారులు దానిని మూసి వేయడం జరిగింది. అదే సమీపాన మళ్లీ ఇప్పుడు బోరు వేసి ఇక్కడ ఉన్న స్థానికులకు నీటి వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్తున్నారు. ఈ నీటిని మళ్లీ టెస్ట్ చేసి సరఫరా చేసే ప్రయత్నం కూడా చేయట్లేదు అంటూ ఆరోపిస్తున్నారు. అదే కాకుండా ఈ బోరు నిర్మించే ప్రాంతంలో నాలుగు రోడ్ల కూడలి ఓల్డ్ డిపో, గవర్నమెంట్ హాస్పిటల్ పాత కొత్తగూడెం, ఇండియన్ గ్యాస్ గూడెం మీదుగా స్మశాన వాటిక నాలుగు రోడ్లు కలుస్తుంది దీని వలన రోడ్డు ఈ ప్రాంతాన కలవడం వలన వెడల్పుగా ఉండాలని గతంలో రోడ్ సర్వే అధికారులు చెప్పారని అంటున్నారు. ఇప్పుడు బోరు



కోసం రూమును కడుతున్న స్థలము గవర్నమెంట్ వారు రోడ్డు విస్తరణకు వదిలివేయడం జరిగినది. కాబట్టి ఇప్పుడే జరుగుతున్న ఈ బోరు నిర్మాణ క్రమంలో ఉన్నది కనుక ఈ బోరును వేరే స్థలముకు మార్చవలసిందిగా అధికారులను కోరుతున్న 24వ వార్డు ప్రజలు దీనిపైన మున్సిపల్ అధికారులను ఆరా తీయగా బోరు కోసం నిర్మిస్తున్న రూముకు మేము ఎటువంటి అనుమతి ఇవ్వలేదు అంటూ మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చెప్పారు. అంటూ ఇక్కడ ఉన్న స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తమ పరిస్థితులను అర్థం చేసుకొని 24వ వార్డులో ఏర్పాటు చేస్తున్న మినరల్ ప్లాంటును మరొక ప్రాంతానికి మార్చవలసిందిగా కోరుతున్నారు.

# బాలల హక్కులు, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



.కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్)–బాలల హక్కులు, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. బాలల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాలల చట్టాల అమలు వంటి అంశాల్లో తీసుకొంటున్న చర్యలపై జిల్లా సంక్షేమ, మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐ డి ఓ సి సమావేశ మందిరంలో డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా బాలలకు రక్షణ కల్పించడం జరిగిందన్నారు. వీరికి పూర్తిస్థాయిలో సంరక్షణ అందించి ప్రయోజకులను చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాలల భద్రత శ్రేయస్సుకు సంబంధించి ప్రభావితం చేసే సమస్యలపై కమిటీ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఓపెన్ షెల్టర్స్‌లో ఆశ్రయం పొందుతున్న వీధి బాలల వివరాలను సేకరించి పూర్తిస్థాయి విచారణ జరిపిన అనంతరం తల్లిదండ్రులు, సంరక్షకులకు అప్పగించాలని, ఎవరూ ముందుకురాని అనాథలను బాలల గృహాలలో పూర్తి సంరక్షణ తీసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బాలల గృహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వారికి కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించాలన్నారు. పిల్లల సంరక్షణ, రక్షణ చట్టంలో పొందుపరిచిన బాలల హక్కులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.బాలల రక్షణ,సంరక్షణ, బాల్యవివాహాల నిరోధం, బాల కార్మికుల నిర్మూలనకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ విద్యాచందన, డిడబ్ల్యూఓ విజేత, ఎస్సీ సంక్షేమ అధికారి అనసూయ, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షర్ఫుద్దీన్, సంక్షేమ సమితిసభ్యులు, మరియు పోలీస్ సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలి

**–జిల్లా అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్.**

పినపాక. సూర్య (మేజర్ న్యూస్)–మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలి అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ అన్నారు.వ్యవసాయం చేస్తూ, కష్టాన్ని నమ్ముకుని పంటలు పండించి, దేశానికి పట్టెడన్నం పెట్టి కాపు కాసే మున్నూరు కాపులు ఆర్థిక, సామాజిక రాజకీయ రంగాల్లో వివక్షతకు గురయ్యారని , ఈ వెనుకబాటును అధిగమించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ కోరారు. మున్నూరు కాపు చైతన్య యాత్రలో భాగంగా పినపాక మండలంలో పర్యటించిన ఆయన సింగిరెడ్డిపల్లి గ్రామంలో బొడ్డు ఏసుబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా వెనుకబాటుకు గురై కార్పొరేషన్ కోసం కొట్లాడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేసుకోవడం గొప్ప పరిణామం అన్నారు. సందర్భంగా సమావేశం హాజరైన జిల్లా బాధ్యులు ప్రసంగించారు. రాష్ట్ర అధ్యక్షులు తొలిసారి మండలానికి రావడంతో సంఘ నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం మున్నూరు కాపులు చైతన్య యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసాలా వెంకటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ ఆది కోటేశ్వరరావు, జిల్లా కన్వీనర్ జోగం తారక్, రాష్ట్ర కమిటీ సభ్యులు నర్సింహారావు, మండల మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి తోట వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షుడు పసునూరి అంజయ్య, వెంకన్న, మండల కమిటీ సభ్యులు గండ్రాతి ప్రవీణ్ బొడ్డు మంగయ్య కృష్ణ మోహన్, శాఖ ముడి వెంకటయ్య, మేచినేని బలరాం, రాయపురెడ్డి సుబ్బారావు, కే బలరామ కృష్ణ, గుత్తి మల్లయ్య, సాయిరి రవి, తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి రూ 10వేలు ఆర్థికసాయం అందజేసిన జడ్పీటీసీ



బూర్గంపాడు, సూర్య (మేజర్ న్యూస్)–మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన ఉల్లోజు హరీష్ మృతిచెందాడు. శుక్రవారం ఈ విషయం తెలుసుకున్న జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు నివాసానికి వెళ్లి హరీష్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపి దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుర్సం వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ చిన్న మల్లయ్య, నాయకులు బొడ్డకల సహదేవ్, నాయకులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు

**–తహశీల్దార్ ముజాహిద్**



బూర్గంపాడు, సూర్య (మేజర్ న్యూస్)–మండలంలో అక్రమంగా ఇసుక రవాణాచేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ముజాహిద్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్లో మణుగూరు వైపు నుంచి మహబూబాబాద్ కు వెళుతున్న ఇసుక లారీలను ఆపి తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలు లేకపోతే ఎంతటి వారైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే మండలంలో ఆర్ఐలు అనధికార ర్యాంపులను సీజ్ చేయడం జరిగిందని, మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు, సారపాకతో పాటు నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో నాలుగు ప్రదేశాల్లో ఇసుక నిల్వలను ఆర్ఐ ముత్తయ్య సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్ ఐ నర్సింహారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకులంలో ఇంటర్ ప్రవేశానికి కౌన్సిలింగ్

బూర్గంపాడు, సూర్య (మేజర్ న్యూస్)–మండల పరిధిలోని కృష్ణసాగర్లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కృష్ణసాగర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ హరిసింగ్ శుక్రవారం తెలిపారు. 2024–25 సంవత్సరానికి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని 2023–24 సంవత్సరంలో రెగ్యులర్ ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు 25వ తేదీన టీటీడబ్ల్యు ఆర్ జేసీ కిన్నెరసాని కళాశాలలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు. కౌన్సిలింగ్ కు హాజరయ్యే విద్యార్థులు టీసీ, ఎస్ఎస్సీ మెమో, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రం ఆదాయ ధ్రువీకరణ పత్రాలను , ఆధార్ కార్డు స్పోర్ట్, ఆర్ఫాన్, పీహెచ్సీ, ఒక సెట్ ఒరిజినల్, మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో, మూడు ఫోటోలతో హాజరుకావాలని కోరారు. ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40, హెచ్ఇసీ 40 సీట్లు ఉన్నాయని, ప్రతి గ్రూపులో ఎస్టీ 34, బీసీ 01, ఎస్సీ–1, ఓసీ 1, స్పోర్ట్–1, పీహెచ్సీ–1, ఆర్ఫాన్–1 సీట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చింది

**మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్ లాల్**
**ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డిని గెలిపించాలి**





**వైరాసూర్యమేజర్ న్యూస్:** వైరా నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ మాట్లాడుతూ రాబోయే నల్గొండ , ఖమ్మం, వరంగల్ ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి విజయానికి పాటు పడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు అధికారంలోకి వచ్చి 150 రోజులు గడుస్తున్న నేటికీ సంక్షేమ పథకాలు అమలు జరగటం లేదని అన్నారు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో గత పది సంవత్సరాల కాలంలో %ఱ% రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు రైతులు పేదలు సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు రాబోయే ఉమ్మడి ఖమ్మం వరంగల్ నల్గొండ జిల్లాల పుట్ట బద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి రాకేష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు గ్రాడ్యుయేట్ ఓటర్లును టిఆర్ఎస్ అభ్యర్థికి ఓట్లు వేసే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపు ఖాయమని అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు పట్టణ అధ్యక్షులు మద్దెల రవి మాజీ దిశా కమిటీ సభ్యులు కట్ట కృష్ణార్జున రావు నాయకులు డాక్టర్ కాపామురళి కృష్ణ పెరుమాళ్ళ కృష్ణమూర్తి నూక ల ప్రసాద్ రావు నూకల వాసు వనమా విశ్వేశ్వరరావు దేవరాజ్ ఏదునూరి శ్రీనివాసరావు ఆదూరి ప్రేమ్ కుమార్ మాదినేని ప్రసాదు నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాయల శేషగిరిరావు ఆత్మకు శాంతి చేకూరాలి

**టీ-టీడీపీ ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం**



**మధిర, సూర్యా మేజర్ న్యూస్:** తెలుగు దేశం పార్టీ మాజీ నాయకులు,ప్రస్తుత భారాస నేత డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ రాయల శేషగిరిరావు స్వర్గస్తులైన విషయం తెలిసిందే. శుక్రవారం టీటీడీపీ ఉపాధ్యక్షులు ఖమ్మం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథ తల్లాడ మండలం మిట్టపల్లిలోని స్వర్గీయ రాయల శేషగిరిరావు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల శేషగిరి ఖమ్మం జిల్లాకు సుపరిచితుడని, బహుముఖ రాజకీయవేత్తని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తల్లాడ మండల టీడీపీ అధ్యక్ష ఉపాధ్యక్షులు కూచిపూడి వెంకటేశ్వర్లు శ్రీనివాసరాజు కల్లూరు మండల టీడీపీ అధ్యక్షులు చిట్టిబాబు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సమస్యలపై అవగాహన సదస్సు ను ఏర్పాటుచేసిన మత్స్యశాఖసొసైటీ అధ్యక్షులు షేక్ రహీం



వైరా.సూర్యమేజర్ న్యూస్: వైరా మున్సిపాలిటీ పరిధిలో గల లాలాపురం గ్రామంలో మత్స్యశాఖ మరియు మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ సదస్సులో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు రహీం మాట్లాడుతూ మత్స్యకారుల పిల్లలు ఏ రంగంలోనూ తక్కువ కాదు మొన్న ఇంటర్ ఫలితాల్లో కూడా మన మత్స్యకారుడి బిడ్డ అత్యధిక మార్కులు సాధించింది. మత్స్యకారుల కుటుంబంలో నుంచి మన పిల్లలు అన్ని రంగాల్లో ముందు ఉండాలనీ ప్రతి ఒక్క మత్స్యకారుడు తమ యొక్క సభ్యత్వాలను ఆన్లైన్లో నమోదు చేసుకొని అలాగే మత్స్యకారులకు వర్తించే బీమా,పథకాలు అన్నిటికీ ఇది ఎంతగానో అండగా ఉంటుందని తెలియజేశారు. అదేవిధంగా వైరా చెరువులో చాపలు వేటకు అతి తొందరలోనే దిగుదామని నీళ్లు తక్కువగా ఉన్నందున వేటకు వెళ్లడం కుదరదు. అందుకు గాను జూన్ మొదటి వారంలో చేపల వేటకు దిగుటకు అందరూ సిద్ధంగా ఉండాలని సంఘ సభ్యులందరికీ సూచించడం జరిగినది. మత్స్యకారులు అందరూ ఆనందించారు.ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు రహీం, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

**- బ్రహ్మం గారి ఆలయంలో ప్రత్యేక పూజలు**



**సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్** పట్టణంలోని విరాట్ నగర్ లో గల శ్రీ మద్విరాట్ పోతులూరి విరబ్రహ్మేంద్ర స్వామి 331 వ ఆరాధన దినోత్సవం సందర్భంగా ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఎం.ఎల్.ఏ డా.మట్టా రాగమయిదయానంద్ విజయ్ కుమార్.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరినట్లు ఆమె తెలిపారు.అనంతరం హజరైన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## వైరా గ్రేట్ విజన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో త్రాగు నీరు బోరు కు ఆర్థిక సహాయం



వైరా.సూర్యమేజర్ న్యూస్: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి ఆధ్వర్యం లో వైరా మండలం పినపాక గ్రామం బీసీ కాలనీ నందు త్రాగు నీరు కోసం బోరుకావలి అని గ్రామస్తులు పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ గారిని సంప్రదించగా వారు స్పందించి వైరా గ్రేట్ విజన్ లయన్స్ క్లబ్ ద్వారా అందిస్తాము. అని గతం లో చెప్పాగా ఈ రోజు 18,000/- రూపాయలు ఆర్థిక సహాయం ని అందించారు. బీసీ కాలని వాళ్ళు మరియు గ్రామస్తులు డాక్టర్ కాపామురళీకృష్ణా గారిని ఘనంగా సన్మానించారు .ఈకార్యక్రమము లో ఆర్సీ లగడపాటి ప్రభాకరరావు తోటకూర శ్రీకాంత్ వుయ్యూరు రామకృష్ణ పినపాక మాజీ సర్పంచ్ పుల్లంరాజు కృష్ణారావు దాసు రాంరెడ్డి మరియు స్థానికులు పాల్గొన్నారు.




## ఉపాధి హామీ పనులు పరిశీలించిన అడిషనల్ డిఆర్డిఓ శిరీష




**కామేపల్లి, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని జాస్తి పల్లి,ముచ్చర్ల గ్రామలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను అడిషనల్ డిఆర్డిఓ బి. శిరీష ఆకస్మికంగా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ఆమె మాట్లాడుతూ పనికి వచ్చే కూలీలకు రోజుకి 300 రూపాయలు వచ్చే విధంగా పనిచేసుకోవాలని సూచించారు.అదేవిదంగా పని చేసే ప్రదేశంలో కూలీలతో సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలకు పనికి తగిన వేతనం వస్తుందా అని ప్రశ్నించగా కచ్చితంగా మేము చేసిన పనికి మాకు వేతనాలు అందుతున్నాయని కూలీలు ఆమెకు తెలియజేశారు.ఈ ఉపాధి హామీ పని వలన మేము మా గ్రామాలలో ఉంటూ,వలసలు పోకుండా విజయవాడ హైదరాబాదు పనుల నిమిత్తం పోకుండా మాకు ఎంతో ఉపయోగకరంగా ఉందని కూలీలు తెలియజేశారు. ముచర్ల జీపీ లో జరుగుతున్న ఖండిత కందకాలు పనిని చూసి ఈ కంధకాలలో వర్షపు నీరు నిలబడి భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయి కూలీలకు వివరించడం జరిగింది. ఇట్టి పనులు సంతృప్తికరంగా ఉన్నాయని తెలియజేయడం జరిగింది. వంద రోజులు పూర్తి చేసుకున్న కూలి కుటుంబాలకు అర్హతలను బట్టి ఉన్నతి ద్వారా కూలీలు ఎంచుకున్న రంగంలో ట్రైనింగ్ ఇచ్చి వాళ్ళు స్వయం ఉపాధి కల్పించబడుతుందని వివరించడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఏపీవో శ్రీ రాణి, ఈసీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు రవి, రమేష్,టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, డేవిడ్ రాజ్,బావ్ సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లు రాంబాబు,మంజుల, మెట్లు, వీరన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ బోగీల సంఖ్య పెంచాలి

**భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో రైల్వే అధికారులకు వినతి పత్రం**



**మధిర, సూర్య మేజర్ న్యూస్:**అన్ని రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య 6 కు పెంచాలని శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఖమ్మం స్టేషన్ సూపర్డెంట్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే పేరెన్నికగన్న భారతీయ రైల్వేలు పేద మధ్యతరగతి ప్రజల ప్రయాణాలను నరకానికి నకళ్ళుగా మార్చాయన్నారు. దేశంలో తొంభై శాతానికి పైగా ప్రజలు ప్రయాణించే జనరల్ బోగిలను పెంచడంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా చాలా ప్యాసింజర్ రైళ్లను సైతం రద్దు చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. జనరల్ బోగీలు లేమీ కారణంగా విద్యార్థులు ఉద్యోగులు చిరు వ్యాపారులు కూలీలు వలస కూలీలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి ప్రతి రైలు నందు ముందు రెండు వెనక రెండు జనరల్ బోగీలతో పాటు ఒక ఎస్ ఎల్ ఆర్ భోగి ఉండాలి కానీ రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అది ముందు ఒకటి వెనక ఒకటి జనరల్ బోగీలుగా మారిందన్నారు. రైల్వే శాఖకు ఆదాయం వస్తున్నప్పటికీ జనరల్ బోగీలు పెంచకపోవడం దురదృష్టకరమన్నారు సీనియర్ సిటిజన్స్ కు కరోనా సమయంలో తొలగించిన పలు రాయితీలను కూడా ఇంతవరకు పునరుద్ధరించలేదని వెంటనే వాటిని పునరుద్ధరించేలా ఏర్పాట్లు చేయాలని రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం తీసుకున్నానంతరంఈ విషయాన్నిరైల్వే అధికారులు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ తాటి వెంకటేశ్వర్లు పోటు కళావతి తోట రామాంజనేయులు మేకల శ్రీనివాసరావు రావి శివరామకృష్ణ జిల్లా సమితి సభ్యులు గాదె లక్ష్మీనారాయణ,ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, నంబూరి శంకర్రావు, మేకల రవి,మధిర మండల కార్యవర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 19న సత్తెనపల్లి భవన్ ప్రారంభోత్సవం

- ప్రారంభకులు కేరళ మాజీ ఆరోగ్యశాఖ మంత్రి కెకె శైలజా టీచర్
- ముఖ్య అతిథి సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- రెడ్ షర్ట్ వాలంటీర్లతో కవాతు - ప్రదర్శన
- ఖమ్మం హవేలీ అభివృద్ధిలో సీపీఐ (ఎం) కీలకపాత్ర
- సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

**ఖమం, సూర్య ప్రతినిధి:** ఖమ్మం ఖానాపురం హవేలీ ప్రాంత అభివృద్ధిలో సీపీఐ (ఎం) కీలక భూమిక పోషించిందని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్ లో విలీనానికి ముందు దాదాపు 20 ఏళ్ల పాటు హవేలీ సర్పంచ్, ఎంపీటీసి పాలనా బాధ్యతలను నిర్వహించిన సీపీఐ (ఎం) హయాంలో ఆ ప్రాంతం ప్రగతి పథంలో నడిచిందన్నారు. అటువంటి సీపీఐ (ఎం) హవేలీ కమిటీ ఆధ్వర్యంలో ఆ ప్రాంతానికి చెందిన పోరాట యోధుడు సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో స్థానిక ఇందిరానగర్ సెంటర్లో నిర్మించిన సీపీఐ (ఎం) ఖానాపురం హవేలీ కమిటీ నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఈ భవనాన్ని కేరళ రాష్ట్ర శాసనసభ్యులు , ఆ రాష్ట్ర మాజీ ఆరోగ్యశాఖ మంత్రి, సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు కేకే శైలజ టీచర్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు హాజరవుతారని వివరించారు. ఆఫీస్ పక్కనే ఉన్న వినియోగదారుల ఫోరం స్థలంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

లి సీపీఐ (ఎం) హయాంలో కార్పొరేషన్ కు దీటుగా







హవేలీ అభివృద్ధి

సీపీఐ (ఎం) హయాంలో కార్పొరేషన్ కు దీటుగా ఖానాపురం హవేలీ ప్రాంతం అభివృద్ధి చెందిందని తెలిపారు. పార్టీ ప్రస్తుత జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలుగా ఉన్న బుగ్గవీటి సరళ ఆనాడు సర్పంచ్ గా ఈ ప్రాంత అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లారని చెప్పారు. సీపీఐ (ఎం) పోరాటాల ఫలితంగానే ఈ ప్రాంత పేదలకు ఇళ్ల స్థలాలు సమకూరాయని తెలిపారు. ఫ్లోరైడ్ రహిత మంచినీటి సరఫరా ప్రారంభమైందన్నారు. రస్తోగినగర్, వేణుగోపాల్ నగర్ లో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ జరిగిందన్నారు. వైయస్సార్ నగర్ స్థలాలు కూడా నాడు సీపీఐ (ఎం) చేసిన పోరాట ఫలితంగానే సిద్ధించాయని పేర్కొన్నారు. హవేలీ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల కాలనీలు కూడా తమ పోరాట ఫలితంగానే ఏర్పడ్డాయని, ఈ పోరులో భాగంగా 250 మందికి పైగా సీపీఐ (ఎం) కార్యకర్తలు అరెస్టై జైలు పాలయ్యారని తెలిపారు. ఖమ్మం నగరానికి తలమానికంగా ఉన్న అపార్ట్మెంట్ నిర్మాణాలు కూడా హవేలీ ప్రాంతం నుంచే ప్రారంభమయ్యాయని అన్నారు. సిసి రోడ్లు, లింకు రోడ్ లు ఇలా అనేకం హవేలీ ప్రాంతంలో సీపీఐ (ఎం) కృషి ఫలితంగా ఏర్పడ్డాయని అన్నారు. ఖమ్మం నగరానికి తలమానికంగా హవేలీ ప్రాంతం అభివృద్ధి చెందిందంటే దాంట్లో సిపిఎం పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు.

**అకడమిక్ గ్రంథాలయం... వైద్య శిబిరం**

సీపీఐ (ఎం) హవేలీ కార్యాలయం కేవలం పార్టీ కార్యకలాపాలకే కాకుండా కార్యాలయంలో అకాడమిక్ గ్రంథాలయంతో పాటు ప్రతినెలా ఓ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో జిల్లాలో ఆరు మెడికల్ క్యాంపులు నడుస్తున్నాయని, ఏడో క్యాంపు హవేలీ కార్యాలయంలో ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో భాగంగా రూ.3000 విలువచేసే మందులను రూ.100కు అందిస్తామని తెలిపారు. సత్తెనపల్లి భవన్ నిర్మాణానికి కృషిచేసిన సీపీఐ (ఎం) జిల్లా నాయకులు బుగ్గ వీటి సరళ, డి. తిరుపతిరావు, మిగిలిన నాయకులను నున్నా ప్రత్యేకంగా అభినందించారు.

సన్నరకం వడ్లకే రూ.500 బోనస్ సరికాదు..

సన్న రకం ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం సరికాదన్నారు. దాదాపు 80 శాతం ధాన్యం దొడ్డు రకాలే ఉంటాయని అన్నారు. ఏ రకమైన ధాన్యమైనా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షానికి దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఆదాయం పేరుతో రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. సామాన్య ప్రజలపై భారం వేసే చర్యలు సరికాదన్నారు. సంపద సృష్టించి ప్రజలకు ఇస్తామన్న ఉప ముఖ్యమంత్రి భట్టి ఆ దిశగా చర్యలు తీసుకోవాలి తప్ప ప్రజలపై భారం వేసే దిశగా ఆలోచన చేయడం సరికాదని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుగ్గ వీటి సరళ, వై. విక్రమ్, హవేలీ కార్యదర్శి తిరుపతిరావు పాల్గొన్నారు.

## బదిలీపై వచ్చిన మేనేజర్ రామస్వామిని అభినందించిన డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



**కామేపల్లి,సూర్య మేజర్ న్యూస్** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నుండి కామేపల్లి మండలం తాళ్లగూడెం బ్రాంచ్ కు బదిలీపై వచ్చిన మేనేజర్ రామస్వామి ని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ శుక్రవారం శాలువా కప్పి సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ కార్యదర్శి నుండి బ్యాంక్ అధికారిగా ప్రమోషన్ పొంది అనేక బ్రాంచ్ లలో వివిధ పదవుల ద్వారా బ్యాంకు అభివృద్ధికి సేవలందిస్తూ తను కూడా మేనేజర్ స్థాయికి ఎదిగాడని అన్నారు. రామస్వామి ఈ బ్రాంచ్ లో కూడా రైతులకు, ప్రజలకు, వ్యాపారులకు బ్యాంక్ అందించే వివిధ రకాల రుణాలను ప్రజలకు అందిస్తూ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలని కాంక్షించారు.అలాగే తను కూడా యూనియన్ లీడర్గా పనిచేస్తూ ఉద్యోగస్తుల కు సేవ చేస్తున్నారని అతను ఉద్యోగంతో పాటు సేవా దృక్పథంతో పనిచేస్తున్నటువంటి మంచి వ్యక్తి అని ఆయన సేవలు మనకు మన బ్యాంకుకు ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎం.రామస్వామి,సూపర్వైజర్ ఎండి ఆసిఫ్ అలీ, అసిస్టెంట్ మేనేజర్ కె.రామారా వు,క్యాషియర్ తస్లీమ్,మెసెంజర్ నరసయ్య, శీలం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలి!

### కామేపల్లి ఏవో బి తారా దేవి



**కామేపల్లి సూర్య మేజర్ న్యూస్** రైతులందరూ నకి విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఎవరైనా సంచులలో కానీ, నకిలీ లేబుల్ తో ఉన్న ప్యాకెట్ల కానీ విత్తనాలు అమ్మినట్లయితే ఎట్టి పరిస్థితుల్లోను అటువంటి వారి వద్ద విత్తనాలు తీసుకోవద్దని, లైసెన్ కలిగిన అధికృత డీలర్ నుండి మాత్రమే విత్తనాల తీసుకోవాలని సూచించారు. పంట కాలం పూర్తయే వరకు బిల్లును జాగ్రత్తపరచుకోవాలని సూచించారు గ్రామాలలో ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాల అమ్ముతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే తమ కు తెలియజేయాలని సూచించారు. వేసవిలో లోతు దుక్కులు చేయడం వలన భూమి లోహ పొరల్లో ఉన్న పురుగుల యొక్క అవశేషాలను నశిం చేయొచ్చని తెలిపారు. పచ్చిరొట్ట పైర్ల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని . వరి పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా ఎన్నోఅనర్థాలు ఉన్నాయని రైతులు ఈ విషయాలను గమనించాలని కోరారు.

## మంత్రి తుమ్మల ను మర్యాద పూర్వకంగా కలిసిన పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి తీన్ మార్ మల్లన్న.

**ఖమ్మం,సూర్య బ్యూరో** లితెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని ఖమ్మం,వరంగల్, నల్గొండ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ( చింతపండు నవీన్) శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు..ఈ కార్యక్రమంలో డి.సి.సి.బి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు ,ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వర రావు తదితరులున్నారు



# లయన్స్ క్లబ్ మరియు లయన్స్ హార్ట్ అండ్ ఐ ఫౌండేషన్ అద్వర్యం లో ఆర్ధికసహాయం




**వైరా.సూర్యరూరల్ న్యూస్ః–** గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి అద్వర్యంలో ఇటీవల అనారోగ్యం కు గురైన వైరా బోడేపూడి కాలనీ కీ చెందిన రాజు నిమ్స్ హాస్పిటల్ లో వైద్యం కోసం అడ్మిట్ అయిన సందర్భం గా వైద్య ఖర్చుల నిమిత్తం వైరా గ్రేట్ విజన్ క్లబ్ సభ్యులు మరియు లయన్స్ హార్ట్ అండ్ ఐ ఫౌండేషన్ అద్వర్యం లో 40,000/–రూపాయలను ఆర్ధికసహాయం అందించారు. ఈ కార్యక్రమము లో పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ గారు మాట్లాడుతూ గతము లో కూడా లయన్స్ హార్ట్ అండ్ ఐ ఫౌండేషన్ ద్వారా మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ తీగల మోహనరావు గారి సహకారం తో గుండె జబ్బు తో హైదరాబాద్ లో వైద్యము పొందిన వారికి సహాయం చేయటం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమము లో %+మీ% కోఆర్డినేటర్ ఉంద్రు శ్యామ్ బాబు, లగడపాటి ప్రభాకరరావు తోటకూర శ్రీకాంత్ గంగవరపు కిషన్ వుయ్యూరు రామకృష్ణ జాలా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు గుడ్‌మార్నింగ్ గ్రూపు సాయం

**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి మే17)మండల విశ్వనాధపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మృతుల కుటుంబాలకు కారేపల్లి క్రాస్‌రోడ్ కు చెందిన గుడ్‌మార్నింగ్ సోషల్ మీడియా గ్రూపు సభ్యులు శుక్రవారం సాయం అందించారు. విశ్వనాధపల్లికి చెందిన పంచాయతీ వర్కర్ విసనపల్లి వెంకటేష్‌సౌజన్య ల కుమార్తె అన్యన్య(7నెలలు) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆకుటుంబానికి గ్రూపు సభ్యులు ఆర్ధిక సాయం అందించారు.కారేపల్లి క్రాస్‌రోడ్‌కు చెందిన చింత లక్ష్మి ఇటివల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని పరామర్శించిన గ్రూపు సభ్యులు క్వింటా బియ్యాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో



గ్రూపు సభ్యులు పుచ్చకాయల శ్రీనివాసరావు, వడ్డె వెంకటయ్య,చిప్పలపల్లి వెంకన్న, గుజ్జర్లపూడి రాకేష్,హైమద్ పాషా, బాలాజీ,పాముల సురేష్,హట్కర్ నెహ్రూ, భద్రం,నరేష్,బట్టు మోహన్,గంగాధరణి ఉపేంద్రచారి,నిమ్మల వెంకటేష్,మల్లెకంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాకు సీఎం అభినందనలు

**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి మే17)కాంగ్రెస్ పార్టీ వైరా నియోజవర్గ సోషల్ మీడియా ఇంచార్జీ కనకం పవన్ కళ్యాణ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు .హైదరాబాద్‌లో జరిగిన సోషల్ మీడియా కోఆర్డినేటర్ల సమావేశంలో ఖమ్మం జిల్లా సోషల్ మీడియా తో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా చర్చించారు. పార్లమెంట్ ఎన్నికలలో సోషల్ మీడియా చేసిన పాత్రకు మెచ్చిన ఆయన వైరా నియోజవర్గ సోషల్ మీడియా ఇంచార్జీ కనకం పవన్ కళ్యాణ్ ను భుజం తట్టి అభినందించారు. ఎన్నికలలో సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేసి సీఎం మెప్పు పొందిన పవన్‌కళ్యాణ్ టీమ్‌ను మండల కాంగ్రెస్ నాయకత్వం అభినందించింది.



# లారీలకు లోడింగ్ ఇవ్వండి

- నాల్గవ రోజు నిరసనలో వంటా వార్పు
- సింగరేణి యాజమాన్యం స్పందించే వరకు నిరసన ఆగదు
- లారీ యజమానులు





సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్ సింగరేణి నమ్ముకొని లారీలు నడుపుతున్న తమకు లోడింగ్ ఇచ్చి ఆదుకోవాలని, పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతున్న సింగరేణి ఇప్పటికైనా తమ పందాను మార్చుకొని, రైలు మార్గం ద్వారా జరుపుతున్న బొగ్గు రవాణాను నిలిపివేసి, రోడ్డు మార్గం ద్వారా బొగ్గును తరలించాలని, తమకు ఇచ్చిన హామీ ప్రకారం 40% లోడింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరసనలో భాగంగా వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు లారీ యజమానులు. 2006లో సింగరేణి యాజమాన్యం అప్పటి భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా విస్మరించి, లారీ యజమానుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ గత నాలుగు రోజులుగా లారీ యజమానుల యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమం నాలుగో రోజు తీవ్ర రూపం దాల్చింది. నాలుగో రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా కుటుంబాలతో కలిసి వంట మార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమేష్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం లారీలకు 40% బొగ్గు లోడింగ్ ఇవ్వాల్సి ఉన్న, ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగానే ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. ఆర్ సి హెచ్ పి ద్వారా తమకు ఇవ్వాల్సిన 40 శాతం బొగ్గును తరలించి, రైలు మార్గం ద్వారా తరలించి తమ పొట్టలు కొడుతుందని, రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా నిలిచిపోవడంతో కిస్తీలు కట్టలేక ఫైనాన్స్ వారి కి లారీలు అప్పగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి భూ నిర్వాసితులమైన తాము లారీలను కొనుగోలు చేసి, లోడింగ్ ద్వారా వచ్చిన అర,కొర పైసలతో కుటుంబాలను పోషించుకుంటుంటే మాపై పిడుగు వేసినట్లు ఆ 40% బొగ్గు బొగ్గులు కూడా లోడింగ్ కు ఇవ్వకుండా నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గత నాలుగు రోజులుగా సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుందామని చూసిన, సింగరేణి యాజమాన్యం చీమకుట్టినట్లు కూడా లేనట్లు వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మార్పు కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. సింగరేణి యాజమాన్యం స్పందించకుంటే నిరసన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీ.ఎల్ ప్రసాద్, కోటిరెడ్డి,షేక్ కీజర్, నజీర్ బాబు, షేక్ లియాఖత్,ఐ.శ్రీనివాసరావు,మునీర్,కోట మోహన్ రావు, సూరిబాబు,వేముల విశ్వనాధం,మౌలాళి,దాసు,మిరియం మధు,మస్తాన్,అన్వర్, రెహమాన్ , చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ నిలిపివేత



కల్లూరు సూర్య మేజర్ న్యూస్ మే (17) :మండల పరిధి పెద్ద కోరుకొండి సబ్ స్టేషన్ పరిధిలో గల 33/11 కే వి లో మరమ్మతుల కారణంగా పెద్ద కోరుకొండి చెన్నూరు లింగాల రావికంపాడు ఎర్ర బోయినపల్లి వెన్నవల్లి తెల్లగవరం మర్లపాడు చిన్న కోరుకొండి తాళ్లూరు వెంకటాపురం గ్రామాలలో ఉదయం 08:00 గంటల నుండి 11:00 వరకు మరమ్మత్తుల కారణంగా విద్యుత్తును నిలిపివేయడం జరుగుతుందని అందులో భాగంగా ఈ గ్రామాల ప్రజలు విద్యుత్తు అధికారులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విద్యుత్తు అసిస్టెంట్ ఇంజనీరు తిరుపతిరావు ఓ ప్రకటనలో తెలిపారు.

# కుమారుడు చదువుల కోసం నిరంతర శ్రమించిన శ్రమజీవులు

**-విద్యాభ్యాసం లేని తల్లిదండ్రులు**

**-డాక్టరేట్ పొందిన కుమారుడు వెంకటరత్నం**

**-అత్యానంద భరితులైన తల్లిదండ్రులు**



నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ మండలం లోని చెన్నారం గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్స్ బట్టపోతుల వెంకటరత్నం డాక్టరేట్ ను పొందారు.అగ్రికల్చర్ డేటా నుంచి తెగుళ్లను వర్గీకరించటానికి డిప్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై అందించారు.ఈ మేరకు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్ ను అందించారు.కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజనీరింగ్ (ఇన్ఫర్మేటిక్స్) విభాగంలో పరిశోధనలు నిర్వహించారు.గైడ్ గా హైద్రాబాద్ కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్, సీబీఐటీ(ఐటీ) డాక్టర్.డి.లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. మారుమూల గ్రామంలో నిరుపేద కుటుంబం లో ప్రాన్సిస్ – రామలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీలు.వీరికి చదువు కూడ రాదు.కానీ కుమారుడు ఉన్నత చదువుల కోసం నిరంతర శ్రమించిన శ్రమజీవులు.ఈ సందర్భంగా కుమారుడు ను పలువురు అభినందించారు. అత్యానంద పరితులైన తల్లిదండ్రులు చదువు మాకు రానప్పటికీ తన కుమారుడు డాక్టరేట్ పొందాడని అనేకమందికి చెప్పుకుంటూ ఆనందం పొందారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కు అవకాశం కల్పించండి

**విద్యావంతులకు మండల కాంగ్రెస్ నాయకులు చాట్ల పరశురామ్ పిలుపు**



**కూసుమంచి సూర్య మేజర్ న్యూస్**.....ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి,గత ప్రభుత్వంలో జరిగిన అరాచకలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు నుంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించిన తీన్మార్ మల్లన్న ను కాంగ్రెస్ పార్టీ గుర్తించి, ఖమ్మం నల్గొండ వరంగల్,కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించడం చాలా సంతోషకరమైన విషయం అని. దీనిలో భాగంగానే ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఉన్న పట్టభద్రులను గుర్తించి ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడు కార్యకర్త సైనికుల పనిచేస్తూ తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఎమ్మెల్సీ ఓటు వేసి గెలిపించి మన సమస్యలు గురించి మాట్లాడతారని ఆయన అన్నారు.

# గొడుగు వితరణ




వైరా.సూర్యరూరల్ న్యూస్: లయన్స్ క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద రోడ్డు ప్రక్కన విగ్రహం నీడన చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న కిన్నెర కృష్ణ మరియు ప్రక్కన జామకాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న కిన్నెర ఆదెమ్మకు ఎండ నుంచి రక్షించుకునే విధంగా లయన్స్ క్లబ్ వారు ప్రత్యేకంగా తయారు చేయించిన గొడుగును పీ.ఎం.జే.ఎఫ్ విడిజి– 2 ఎలెక్ట్ కె.వి ప్రసాద్ గారి సహకారంతో లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు చేతుల మీదుగా పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో క్లబ్బు సహాయ కార్యదర్శి కొల్లా రాంబాబు బాధ్యులు వనమా వెంకటేష్ తదితరులు పాల్గొనినారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్ లు వంద శాతం పంపిణీ చేయాలి





**–ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్**

ఖమ్మం, సూర్య బ్యూరో మే 17:పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పుల పంపిణీ వంద శాతం చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్డీవోలు, తహశీల్దార్లతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణ, ధరణి పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ కు, తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో వుందో తెలియాల్సిన అవసరం ఉందని, ఈ దృష్ట్యా ఓటర్ స్లిప్పుల పంపిణీ, నమోదైన ప్రతి ఓటరుకు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ సంబంధిత బిఎల్ఓ ద్వారా చేపట్టాలని, ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు పంపిణీ పురోగతిపై నివేదిక సమర్పించాలని అన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయాలని, ఏవేని చిన్న చిన్న మరమ్మత్తులు ఉంటే, వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి విడత శిక్షణ ఈ నెల 20న, రెండో విడత శిక్షణ ఈనెల 26న చేపట్టబడునని ఆయన అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్ లో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 26న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ సామాగ్రి తీసుకొని, సంబంధిత పోలింగ్ కేంద్రానికి వెళ్లి, అక్కడే బస చేయాలన్నారు. రిసిప్షన్ కేంద్రం నల్గొండ లోని నాగార్జున కళాశాలలో ఉంటుందని, ఈ నెల 27న పోలింగ్ పిమ్మట నేరుగా రిసిప్షన్ కేంద్రానికి పోలీస్ ఎస్కార్ట్ తో వెళ్లాలని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 15 రూట్లు, ప్రతి రూటుకు రూట్ ఆఫీసర్ ని నియమించామన్నారు. తహశీల్దార్లు సెక్టార్ అధికారులుగా, నయాబ్ తహశీల్దార్లు ఫ్లయింగ్ స్క్వాడ్ గా, ఆర్ఐ లు ప్రత్యేక వీడియో టీమ్ లుగా నియమించినట్లు, శుక్రవారం నుండే తమ విధుల నిర్వహణ చేపట్టాలని ఆయన తెలిపారు. ప్రత్యేక వీడియో టీమ్ కు వీడియోగ్రాఫర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్, ఆర్డీవోలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని ఆయన అన్నారు. ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చేపట్టాలని, ఓటింగ్ విధానం, చేయదగినవి, చేయకూడని పనులపై ఫ్లెక్సీ రూపొందించి, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతించవద్దని ఆయన అన్నారు. ఇండిలిబుల్ ఇంక్ ఎడమచేతి మధ్య వ్రేలుకు పెట్టాలన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలన్నారు. ప్రతిరోజు తహసీల్దార్ కనీసం 20 ఫైళ్లు సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ లలో పెండింగ్ స్లాట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, డిఆర్డీఓ ఎం. రాజేశ్వరి, ఎడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, అనురాధ బాయి, రాంబాబు, సత్యనారాయణ, ఓఎస్డీ నాగేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రతను పరిశీలించిన పోలీస్ కమిషనర్




ఖమ్మం, సూర్య బ్యూరో..ఈవీఎం యంత్రాలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ గ్రామంలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల భవనంలో ఈవీఎం యంత్రాలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్స్ నలువైపులా కేంద్ర పోలీస్ బలగాలు, జిల్లా ఆర్మ్ డ్ పోలీస్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతతో పాటు నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో పటిష్టమైన రక్షణ వుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు కూడా తావు లేకుండా పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ... సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సిఐ రాజిరెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలి..

**జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్**



**ఖమ్మం, సూర్య బ్యూరో మే 17:** ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌళిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలచే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఖమ్మం నూతన కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి లతో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, లోక్ సభ ఎన్నికల పోలింగ్ ను విజయవంతంగా నిర్వహించడంలో కలెక్టర్ లు, ఇతర ఉన్నతాధికారులు, ప్రభుత్వ సిబ్బంది పోషించిన పాత్రను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు మంచి పురోగతి సాధించారని, దాదాపు ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీని ఏర్పాటు చేసి కనీస మౌళిక సదుపాయ పనులు గ్రౌండ్ చేయడం జరిగిందని సీఎస్ తెలిపారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన కనీస మౌళిక వసతుల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాలలను పునః ప్రారంభించేందుకు మనకు మరో 20 రోజుల గడువు మాత్రమే ఉందని, ఆ లోగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని సిఎస్ కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో బాలికల సంఖ్య ప్రకారం తప్పనిసరిగా ప్రత్యేకంగా టాయిలెట్లు ఉండాలని, వీటిని అత్యంత ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు పెయింటింగ్ వేయాలని, ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన చోట పెయింటింగ్ పనులు సైతం చేపట్టాలని, మంజూరు చేసి ఇప్పటి వరకు గ్రౌండ్ కాని పనులు త్వరితగతిన గ్రౌండ్ చేయాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూనిఫామ్ జిల్లాలకు చేరుతున్నాయని, ఇప్పటి వరకు 17 జిల్లాలకు బట్టలు చేరాయని, మరో 3 రోజులలో మిగిలిన జిల్లాలకు యూనిఫామ్ బట్టలు చేరతాయని సిఎస్ తెలిపారు. జిల్లాలో కుట్టు మిషన్లలో అనుభవం కలిగిన గుర్తించిన స్వశక్తి మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫాంలు కుట్టే ఆర్డర్ అందించాలని సి.ఎస్. కలెక్టర్లకు సూచించారు. పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే విద్యార్థులందరికీ తప్పనిసరిగా యూనిఫారం లు అందించే విధంగా సన్నద్ధమయ్యేలా రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని సీఎస్ సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం లక్ష్యంగా మార్చి 15 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్షా 15 వేల దరఖాస్తులను పరిష్కరించామని, లోక్ సభ ఎన్నికల పోలింగ్ ముగిసినందున మరోసారి ధరణి దరఖాస్తుల ప్రత్యేక డ్రైవ్ పునః ప్రారంభించాలని, మే చివరి నాటికి ధరణి పెండింగ్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధరపై కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని, మిల్లుల వద్ద ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదని, అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో పెట్టాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా సత్వరమే కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కనీస మౌళిక సదుపాయాలైన టాయిలెట్లు, త్రాగు నీరు, చిన్న చిన్న రిపేర్ల పనులు పూర్తి చేస్తున్నామని, చేసిన పనులను నమోదు చేసి సకాలంలో బిల్లులు చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. 753 పాఠశాలల్లో పనులు చేపట్టగా, 701 పాఠశాలల్లో విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. 217 పాఠశాలల్లో ప్రతిపాదిత పనులన్నీ పూర్తి అయ్యాయని, మిగతా చోట్ల పనులు పురోగతి లో ఉన్నాయని తెలిపారు. మంజూరైన రూ. 21 కోట్లలో, ఇప్పటికి రూ. 5.18 కోట్లు ఖర్చుచేసినట్లు ఆయన అన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం లోగా పనులన్నీ పూర్తి అవుతాయని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి, సకాలంలో రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ రైస్ మిల్లింగ్ ప్రక్రియ జరుగుతుందని, త్వరితగతిన డెలివరీ పూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారిణి రాజేశ్వరి, డిఇఓ సోమశేఖరశర్మ, డిఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, ఎస్ఇలు చంద్రమౌళి, శ్యామ్ ప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ బ్యాలెట్ బాక్సుల రావాణా కు కార్యాచరణ చేయాలి

## ఎన్నికల అధికారి, కలెక్టర్ వి పి గౌతమ్

**ఖమ్మం, సూర్య బ్యూరో మే 17:** శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిమిత్తం బ్యాలెట్ బాక్సుల రవాణాకు కార్యాచరణ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. తెలిపారు. శుక్రవారం కలెక్టర్ జెడ్పి ఆవరణలోని స్ట్రాంగ్ రూం లో భద్రపరచిన బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కు, పోలింగ్ అనంతరం నల్గొండ లోని రిసిప్షన్ కేంద్రానికి సిబ్బంది, పోలింగ్ సామాగ్రితో వెళ్లుటకు రవాణాకు కార్యాచరణ చేయాయాలన్నారు. టీఎస్ ఆర్టీసీ బస్సులో రూట్ల వారిగా సిబ్బంది, బాక్సులు ఎన్ని పడతాయి, ఎన్ని బస్సుల అవసరం ఉంది ప్రణాళిక చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సులో ఎన్ని బాక్సులు, సిబ్బంది వెళ్లవచ్చొ కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, ఖమ్మం ఎంవిఐ వెంకట రమణ, ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాదులో జరిగే చలో బస్సు భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



భద్రాచలం, సూర్య (మేజర్ న్యూస్)-టి ఎస్ ఆర్ టి సి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భద్రాచలం డిపో కమిటీ ఆధ్వర్యంలో తేదీ 21 మే 2024న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాదులో జరిగే చలో బస్సు భవన్ కార్యక్రమము జయప్రదం చేయాలని,కార్మికులందరికీ కరపత్రాలు పంచి విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ నాయకులు మాచర్ల సుందరం భద్రాచలం డిపో కార్యదర్శి బర్ల రమణారావు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ గత ప్రభుత్వం 90% పూర్తి చేసిందని మిగిలిపోయిన పది శాతం ప్రక్రియను ఈ ప్రభుత్వం పూర్తి చేసి వెంటనే అప్పాయింట్మెంట్ తేదీని ప్రకటించాలని, 2013 ఆర్పీఎస్ కు సంబంధించిన బాండ్ డబ్బులు 50% బకాయిలను కేవలం డ్రైవర్ ఉద్యోగులకు మాత్రమే చెల్లించారని మిగతా కేటగిరీలకు సంబంధించిన ఉద్యోగులందరికీ వెంటనే చెల్లించాలని,రాజ్యాంగం కల్పించిన ట్రేడ్ యూనియన్ హక్కులను కాపాడటంతో పాటు ఆర్టీసీలో యూనియన్లను వెంటనే అనుమతించాలని, సంస్థలో ఉద్యోగులందరికీ సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించి టిక్కెట్ తీసుకునే బాధ్యత పూర్తిగా ప్రయాణికులదే చేసే విధంగా సర్కులర్ రిలీజ్ చేయాలని,వివిధ కారణాలతో సస్పెండ్ అయి రిమూవ్ అయిన ఉద్యోగుల కేసులను వెంటనే పరిశీలించి విధుల్లోకి తీసుకోవాలని, పెంచిన అధిక పనిభారాన్ని తగ్గించడంతో పాటు డ్రైవర్ కండక్టర్ మెకానిక్‌ల రిక్రూట్మెంట్ , ఆర్టీసీ లోనే వివిధ కేటగిరీల నియామకాల పరిక్రియలు వెంటనే చేపట్టాలని కోరారు. ఎస్ఆర్బిఎస్,ఎస్‌బిటి ,సిసిఎస్ ,పిఎఫ్ లకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని,మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల లోపు దిగే డ్యూటీలను కేటాయించాలని, డ్రైవర్లను టిం డ్యూటీ పోవాలని బలవంతపు చేసే కార్యక్రమాలు మానుకోవాలని, మహాలక్ష్మి స్కీమ్లో సంస్థకు చెల్లించే డబ్బుల విషయంలో ప్రభుత్వం ఒకరకంగా, యాజమాన్యం ఒకరకంగా చెప్పటం మానుకొని తక్షణమే వాస్తవాలను కార్మికులకు ప్రజలకు తెలియజేయాలని, ఇట్టి డబ్బులను ప్రయాణికుల రద్దీ కనుగుణంగా బస్సులు కొనడంతో పాటు కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు అన్నింటినీ వెంటనే చెల్లించాలని కోరినారు. చలో బస్సు భవన్ హైదరాబాద్ కార్యక్రమానికి భద్రాచలం డిపో నుంచి యూనియన్లకు అతీతంగా కార్మిక వర్గం తరలిరావాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ఎం. వెంకన్న, కే.రాజేష్,ఈ.ఎన్.కుమార్, ఆర్.ఎన్.భూషణం తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులకు ఉద్యోగ ఫలాలు అందాలి



-ప్రెస్ మీట్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల స్వతంత్ర అభ్యర్థి మిమిక్రీ రమేష్

భద్రాచలం సూర్య( మేజర్ న్యూస్ )- చదువుకున్న పట్టభద్రులకు ఉద్యోగ ఉపాధి సౌకర్యాలు కల్పించాలని, ఎమ్మెల్సీగా తనకు ఒక్క అవకాశం ఇస్తే పట్టభద్రులకు ఉద్యోగ ఫలాలు అందేలా తనదైన శైలిలో ప్రయత్నిస్తానని ప్రముఖ అంతర్జాతీయ, సినీ మిమిక్రీ కళాకారులు, ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల స్వతంత్ర అభ్యర్థి మిమిక్రీ రమేష్ వెల్లడించారు. భద్రాచలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా భద్రాచలం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాత్రికేయ సమావేశంలో మాట్లాడారు. రాజకీయాలకతీతంగా తాను స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో దిగానని తెలిపారు. ఈ మూడు జిల్లాల పరిధిలో ఉన్న గ్రాడ్యుయేట్స్ తో తనకు చక్కని సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. చదువుకున్న నిరుద్యోగులు ఎంతగానో ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు తనకు తెలుసని పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో ప్రవేశించడానికి పట్టభద్రులు తనకు ఓటేసి గెలిపించాలని కోరారు. భద్రాద్రి రాముని దీవెనలతో తాను ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుస్తానన్న నమ్మకం తనకుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, పేదల సంక్షేమం కోసం, యువత బాగు కోసమే తాను ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగానని తెలిపారు. తనకు అందరితో పరిచయాలు ఉన్నాయని, తాను గెలిస్తే తప్పకుండా యువత అభివృద్ధికి పెద్దపీట వేస్తానని తెలిపారు. విద్యారంగంలో ఇంకా చక్కని మార్పులు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనేకమంది యువత డిగ్రీ, పీజీ పట్టా పుచ్చుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక పడరాని పాట్లు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతం కంటే చదువుకునే వారి సంఖ్య బాగా పెరిగిందని, కానీ అందుకు తగ్గ ఉద్యోగ ఉపాధి అవకాశాలు మాత్రం పెరగటం లేదని, పెద్ద సంఖ్యలో నోటిఫికేషన్లు విడుదల చేసి యువతను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని ఆయన డిమాండ్ చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన సీరియల్ నెంబర్ 31 లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్.కె అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

గుండాల, సూర్య (మేజర్ న్యూస్)-గుండాల మండల కేంద్రంలో బతుకమ్మ ఘాట్ వద్ద శుక్రవారం మండలంలోని విశ్వబ్రాహ్మణులు (పంచ వృత్తులు) తమ కుల దైవమైన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331 వ ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత భక్తి ప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ముందుగా వారు విశ్వకర్మ జెండాను ఎగురవేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ మండల అధ్యక్షులు మాజోజు చంద్రాచారి మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి వారు ఎంతో అద్భుతమైన శక్తి కలిగిన వారని, స్వామి వారు భవిష్యత్తులో జరగబోయే సంఘటనలను తన దివ్య దృష్టితో ముందుగానే చూసి కాలజ్ఞానం ద్వారా తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలిశాల రవి, వెలిశాల రమేష్, మాజోజు నర్సింహా చారి, కొనపర్తి దుర్గా చారి, కందుకూరి హనుమా చారి, వెలిశాల శ్రీను, కొనపర్తి వెంకటేశ్వర్లు, దోనోజు వెంకటాచారి, వెలిశాల నరేష్, మాజోజు వెంకటేష్, వెలిశాల కిరణ్, వెలిశాల రాకేష్, కోడూరి పాపా చారి, వెలిశాల సత్యం, దోనోజు శశిధర్, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఫోక్సో కేస్‌లో వ్యక్తికి 20 సంవత్సరముల కఠిన కారాగార శిక్ష

కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్) - పోక్సో కేసులో వ్యక్తికి 20 సంవత్సరముల కఠిన కారాగార శిక్ష విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బాధితురాలు తన కాళ్లకు పక్షవాతం వచ్చి నడవలేని స్థితిలో ఉండగా ఆమె తల్లిదండ్రులు నాటు వైద్యం చేయించుటకై ఖమ్మం నుండి బాధితురాలి అమ్మమ్మ నివసిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మంచి కంటి నగర్ లో వదిలి వెళ్ళినారు. ఈ విధంగా వైద్యం చేయించుకుంటున్న బాధితురాలిని ఇంటి సమీపంలోనే ఉన్న జవ్వాజి సాంబశివరావు 2021 డిసెంబర్ 30న ఒంటరిగా ఉన్న మైనర్ బాలికను తన ఇంటిలో టీవీ చూపించు నేపముతో అక్రమంగా బాధితురాలి ఇంటిలో ప్రవేశించి ఆ బాధితురాలిని బలవంతంగా అతని ఇంటిలోకి ఎత్తుకొని వెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మైనర్ బాలిక కేకలు వేయగా బయటకు వదిలి పరారయ్యాడు. తనకు జరిగిన విషయాన్ని ఏడుస్తూ కూలి నుండి వచ్చిన అమ్మమ్మకు బాధితురాలు చెప్పగా అమ్మాయి తల్లిదండ్రులకు చెప్పి మరుసటి రోజు ఫిర్యాదు చేయగా అప్పటి అశ్వాపురం పోలీసు ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీషీటు దాఖలు చేశాడు. 12 మంది సాక్షుల విచారణ అనంతరము సాంబశివరావు పై నేరం రుజువైనందున ఇరవై సంవత్సరముల కఠిన కారాగారి శిక్ష, రూ 5000 ల జరిమానా విధిస్తూ, బాధితురాలికి పునరావాస పరిహారం కింద రూ 5 లక్షలు చెల్లించే విధంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించగా లైజాన్ ఆఫీసర్ ఎమ్.హరిగోపాల్ (కోర్టు డ్యూటీ ఆఫీసర్ ) పి. సి. మాలోత్ ఈశ్వర్ లు సహకరించారు.




# పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 12వ వార్షికోత్సవం

భద్రాచలం, సూర్య(మేజర్ న్యూస్)- వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 12వ వార్షికోత్సవ కార్యక్రమానికి భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శుక్రవారం జరిపించిన స్వామి వారి 12 వార్షికోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులు శాలువా కప్పి పూలదండతో సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు ప్రముఖ సంఘ సేవకులు గాదె మాధవరెడ్డి ఆలయ కమిటీ సభ్యురాలు కేతినేని లలిత, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి తేందోట సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు భీమవరపు వెంకటరెడ్డి కడియం రామాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అనుబోస్ నరసింహచారి ,జల్లారపు సునీల్ కుమార్,శ్రీ శ్రీ (పండు) ఆలయ కమిటీ సభ్యులు స్థానికులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



# జీవో నెంబర్ 22 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి.




**-ఏఐటీయూసీ నేతలు కే సారయ్య, ఎండి నజీర్.**



ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)- హైకోర్టు తీర్పు ఇచ్చిన ప్రకారం జీవో నెంబర్ 22 ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు వేతనాలను అమలు చేయాలని ఏఐటియుసి సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే సారయ్య, ఇల్లందు బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ లు అన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం స్థానిక వితర్రావు భవన్లో మినీ మహాసభ నిర్వహించారు. ఈ మినీ సభలో సారయ్య,నజీర్ అహ్మదులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలను ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న నిత్యవసర వస్తువుల ధరలను పరిగణలోకి తీసుకొని, గత 16 సంవత్సరాల నుంచి వేతనాలను పెంచక పోవడం వల్ల జరిగిన నష్టాన్ని పరిగణలోకి తీసుకొని శాస్త్రీయంగా కనీస వేతనాలను నిర్ణయించాలని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా విడుదల చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ లో పొందుపరిచిన వేతనాల ప్రతిపాదన సక్రమంగా లేదని,తక్షణమే దానిని ఉపసంహరించుకొని జీవో నెంబర్ 22 ప్రకారం వేతనాలను చెల్లించాలని వారు కోరారు. హైకోర్టు కాంట్రాక్టు కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ కూడా సింగరేణి యాజమాన్యం ప్రభుత్వం అమలు పరచక పోవడం పట్ల వారి చిత్తశుద్ధి కార్మికులు అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పనిచేస్తున్న అనేక రంగాల కాంట్రాక్ట్ కార్మికులతో పాటు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు వేలాదిమంది పనిచేస్తున్నారని, అరకొర వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల వేతన సమస్యను పెండింగ్ లో పెట్టకుండా హైకోర్టు తీర్పు కనుగుణంగా జీవో నెంబర్ 22న అమలు చేసి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు కాంట్రాక్టు వాట్ సప్లయ్ హౌస్ కీపింగ్ కార్మికులు ఎఐటియుసి లో చేరారు. వారికి సారయ్య నజీర్ అహ్మద్ లు యునియన్ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈనెల 19 న ఇల్లందులో జరిగే ఎఐటియుసి డివిజన్ మహా సభ ను విజయవంతం చేయాలని వారు పిలుపు ఇచ్చారు. ఈ సమావేశానికీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి గడదాసు నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొరిమి సుందర్,ఎఐటియుసి జిల్లా కార్యదర్శి దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బందం నాగయ్య, ఐతా శ్రీరాములు,రవిశంకర్, సుమన్, మోహన్, కనకతార, ఎల్లవ్వ, జమున, రాజశేఖర్, శివయ్య,చెరుకు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముగిశాయి..

**- కార్మిక సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి**

**-సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మధు**




కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)- రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలు ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కార్మికుల సమస్యల పైన దృష్టి పెట్టి పరిష్కారం చేయాలని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బి మధు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది.ఈ సమావేశంలో బి మధు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక రంగాల్లో కార్మికులు నెలలు తరబడి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పెండింగ్ బిల్లులు పారితోషకాలు నెలల తరబడి పెండింగ్లో ఉన్నాయి. అంగన్వాడీ టీచర్లు హెల్పర్ల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి. గిరిజన ఆశ్రమం పాఠశాలలో హాస్టల్స్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు 12 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి. ఐకెపి వివోఏలు ఆశా వర్కర్లు గ్రామపంచాయతీ కార్మికులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు ఇలా అనేక విభాగాల్లో ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న కార్మికుల వేతన బకాయిలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపాలని బకాయి వేతనాలు అన్నింటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన కొన్ని గ్యారెంటీల్ని అమల్లోకి తెచ్చిందని అయితే కార్మికుల కోసం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రూ 18వేల కనీస వేతనం, కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్ ఉద్యోగ భద్రత తదితర సమస్యలపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు చేయలేదని సిఐటియు పేర్కొన్నది. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదల హామీని వెంటనే అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఎన్నికల ముందు టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికులు వారి వారి న్యాయమైన డిమాండ్లపై సమ్మెలు నిర్వహించారని ఈ సమ్మెలన్నింటిని నాడు ప్రతిపక్షంలో ఉండి సమర్థించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమ్మె డిమాండ్ల పట్ల వాటి పరిష్కారం పట్ల స్పందించకపోవడం విస్మయానికి గురి చేస్తుందని సిఐటియు పేర్కొన్నది. ఇప్పటికే అన్ని శాఖల రాష్ట్రస్థాయి అధికారులకు మంత్రులకు, ముఖ్యమంత్రి కి రంగాల వారీగా కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన డిమాండ్లను తెలియజేస్తూ వినతి పత్రాలు అందజేయడం జరిగిందని సిఐటియు గుర్తుచేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యాలయాల్లో మంత్రులు రాష్ట్ర అధికారులు జిల్లాల పర్యటన సందర్భంలోనూ సిఐటియు సంఘంగా వివిధ రంగాల కార్మికులు స్వచ్ఛందంగా వ్యక్తిగతంగా ప్రభుత్వానికి సమస్యల పైన వేల కొలది విజ్ఞాపనలు అందజేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం మీద కార్మికులు విశ్వాసం కోల్పోతారని అసంతృప్తి కాస్త పోరాటాలకు దారితీస్తుందని సిఐటియు పేర్కొన్నది. కొత్తగా ఏర్పాటు అయిన ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాల అమల్లో కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను సైతం తగిన ప్రాధాన్యత ఇచ్చి అమలు చేయాలని సిఐటియు విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యచరణ ప్రకటించి కార్మిక సంఘాలను సైతం చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిఐటియు సూచించింది. కార్మికుల సమస్యలను పరిష్కారం చేయని యెడల సమస్యల వారీగా నిర్దిష్టంగా ప్రత్యక్ష పోరాటాలకు సిఐటియు సిద్ధంగా ఉందని పేర్కొన్నది. జిల్లాలోని కార్మిక సమస్యల పరిష్కారానికి ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులకి ఎమ్మెల్యేలకు సిఐటియు అనేకసార్లు ఎంత పత్రాలు ఇచ్చిందని ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి మంత్రులు ఇచ్చిన హామీల అమలకు కృషి చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ జె రమేష్ ఉమ్మడి జిల్లాకి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ జిల్లా ఆఫీస్ బేరర్స్ పిట్టల అర్జున్, గద్దల శ్రీను, ఎస్ ఏ నబి, దొడ్డ రవి, డి వీరన్న, కే సత్య, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం.



టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్) – మండల కేంద్రంలో శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఆలయ పూజారి పవనాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# అబ్బయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



గుండాల, సూర్య (మేజర్ న్యూస్)- గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి గుండాల మండలం పోతిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఎట్టి అబ్బయ్య ఇల్లు కూలిపోయిందని ప్రభుత్వం తక్షణమే అతనిని ఆదుకోవాలని గుండాల జడ్పిటిసి వాగబోయిన రామక్క, ఎంపీపీ ముక్తి సత్యం, గుండాల మాజీ సర్పంచ్ కోరం సీతారాములు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబం అంగవైకల్యం కలిగిన ఎట్టి అబ్బయ్య ఇల్లు అకాల వర్షానికి కూలిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడనీ అబ్బయ్య కుటుంబం నెలసరి పించన్ తో జీవనం గడుపుతుందని ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీకి రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఆదాయం

**-డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు**



కొత్తగూడెంటౌన్,సూర్య (మేజర్న్యూస్) – లోక సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 9 నుండి 14 వరకు ఆర్టీసీకి రాష్ట్ర వ్యాప్తంగా భారీగా ఆదాయం వచ్చిందని కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొత్తగూడెం డిపో కూడా ఆరు రోజులపాటు అదనపు ట్రిప్పులు నడిపిందని తెలిపారు. మే14 న 33576 కిలోమీటర్ల కు ఎర్నింగ్స్ రూ25,83 ,078 రావడం జరిగిందన్నారు. ఆక్పెన్సి రేషియో 122%శాతం నమోదయిందని, సాధారణ రోజుల్లో కంటే ఆ ఆరు రోజులు ఎక్కువ ఆదాయం కొత్తగూడెం డిపోకు రావడం జరిగిందన్నారు. అందులో ఈనెల 14న ఎక్కువ ఆదాయం వచ్చినదని, అందుకు గాను రాష్ట్ర లో ఉన్న అన్ని డిపోలలో ఎం.డి ఆదేశాను ప్రకారం కష్టపడిన కొత్తగూడెం ఉద్యోగ సిబ్బందికి స్వీట్స్ పంచడం జరిగిందని తెలిపారు. కొత్తగూడెం డిపో ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండాలని వారికీ ఈనెల 18 నుండి 21వరకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ గా తీసుకొని వారికి టెస్టులు చేయించడం జరుగుతుందని తెలిపారు. ఆ టెస్టుల్లో ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే వారిని తార్నాక హైదరాబాద్ ఆర్టీసీ హాస్పటల్ కు పంపించడం జరుగుతుంది అని తెలియజేశారు.

# నిబద్ధతతో కమ్యూనిస్టు పార్టీలో పని చేయాలి




**– నిత్యం ప్రజలతో మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**

**– సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా.**

పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)–నిబద్ధతతో కమ్యూనిస్టు పార్టీలో పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా కోరారు. ఇటీవల పాత పాల్వంచ ప్రాంతానికి చెందిన పలువురు సిపిఐ లో జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సమక్షంలో చేరారు వారికి శుక్రవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ప్రాథమిక సభ్యత్వం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ లో చేరిన ప్రతి ఒక్కరు ప్రజాసంఘాల బాధ్యతలు స్వీకరించి నిత్యం ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యల పట్ల పూర్తి అవగాహనతో ఉండాలని, కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ సేవలందించే పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని, సిపిఐ సేవలను గుర్తించి ఇటీవల వందలాదిమంది వివిధ పార్టీల నుంచి సిపిఐలో చేరారని, వారి నమ్మకానికి అనుగుణంగా సమస్యల పరిస్కారంకోసం స్థానిక శాసనసభ్యులు కూనంనేని సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని అన్నారు. ప్రజా సమస్యల పరిస్కారమే సిపిఐ ఏకైక అజెండా అని అందుకోసం ఎలాంటి త్యాగానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు శనగారపు శ్రీనివాసరావు, ఎస్ కే పాషా, జకరయ్య, ఎండ్ గౌస్, ఎస్ ఏ రెహమాన్, ఎండి అంజాద్, రమేష్, ఖలీల్, కరీం, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చుంచుపల్లి,సూర్య (మేజర్ న్యూస్)– నేడు మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ మరమత్తుల దృశ్య విద్యుత్ సరఫరాలో అంతర ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏడిఈ ఓ పి హేమచంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు చుంచు పల్లి సబ్ స్టేషన్ లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేడబడునని తెలిపారు. కావున ఈ ప్రాంతాల్లో ని విద్యానగర్–2, బాబు క్యాంప్, రామాంజనేయ కాలని, వెంకటేశ్వర కాలని, వికలాంగుల కాలని, శేషగిరునగర్ , ఇండస్ట్రియల్ ఏరియా, సారయ్య కాలని, రాంనగర్, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# రావు రమేష్ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



చుంచుపల్లి,సూర్య (మేజర్ న్యూస్)– మండలపరిధిలోని చాతకొండ గ్రామపంచాయతీ కాంగ్రెస్ నాయకుడు రావు కిరణ్ తండ్రి, రావు రమేష్ ఇటీవల పాము కాటుకి గురై హాస్పిటల్లో చికిత్స పొంది క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా వారి స్వగృహం లో జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్ చౌదరి, పెద్ద బాబు, మాజీ సర్పంచ్ లు బాధవత్ అనూష, పూనెం సంధ్య శుక్రవారం పరామర్శించి, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఉమ్మడి చాతకొండ కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి వీరయ్య, దయ్యాలా సమ్మయ్య, కడియాల సత్యనారానాయణ,చింత రమేష్,కాలవ క్రాంతి, ఉబ్బని రాజు, తుంపిరి జ్ఞాన ముత్యం, ఎస్ కే మౌలాలి, బోయినపల్లి నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

# తీన్మార్ మల్లన్న ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న నెట్టి సుదర్శన్.

ఇల్లందు టౌన్,సూర్య (మేజర్ న్యూస్)– ఈ నెల 27వ తారీఖున జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను పట్టభద్రులందరూ గెలిపించాలని తీన్మార్ మల్లన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీం కో కన్వీనర్ నెట్టి సుదర్శన్ తెలిపారు. శుక్రవారం ఇల్లందు పట్టణంలో ని గ్రాడ్యుయేట్ అభ్యర్థులను కలుస్తూ మల్లన్న ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా ఇల్లందు మున్సిఫ్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి కుమార్ ని కలిసి తీన్మార్ మల్లన్న ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలనికోరారు. పట్టభద్రుల గొంతుకై సమస్యలను పాలకమండలిలో ఏ కరువు పెడతాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి, శ్యామల, పవన్ కుమార్, టేకులపల్లి మండల ఇన్చార్జి, యనగంటి శ్రీకాంత్. గార్ల,బయ్యారం, ఇల్లందు, కామేపల్లి,మండలం ఇన్చార్జులు పాల్గొన్నారు.



# శ్రీక్రిష్ణ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా అందజేయాలి

**–పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం**

కొత్తగూడెం కలెక్టరేట్, సూర్య (మేజర్ న్యూస్)– పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ పోలూరు శ్రీక్రిష్ణ కుటుంబానికి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అందించవలసిన ఎక్స్ గ్రేషియా మొత్తమును వెంటనే అందించవలసిందిగా కోరుచూ శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ తరపున జిల్లా అధ్యక్షులు యం.రాజేష్, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు వినతి పత్రం అందజేయడం జరిగింది. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వారి కుటుంబానికి ఎక్స్ గ్రేషియా వెంటనే అందించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.. వీరి వెంట జిల్లా సంఘ బాధ్యులు కె.వెంకటలక్ష్మి, కే.అంబికా దేవి, వై.శ్రీకాంత్ రెడ్డి, వెల్ది.ప్రసాద్, కే వి డి ప్రసాద్ , తాళ్లూరి రవి,తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీకి రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఆదాయం

**–డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు**

కొత్తగూడెంటౌన్,సూర్య (మేజర్న్యూస్) – లోక సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 9 నుండి 14 వరకు ఆర్టీసీకి రాష్ట్ర వ్యాప్తంగా భారీగా ఆదాయం వచ్చిందని కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొత్తగూడెం డిపో కూడా ఆరు రోజులపాటు అదనపు ట్రిప్పులు నడిపిందని తెలిపారు. మే14 న 33576 కిలోమీటర్ల కు ఎర్నింగ్స్ రూ25,83 ,078 రావడం జరిగిందన్నారు. ఆక్పెన్సి రేషియో 122%శాతం నమోదయిందని, సాధారణ రోజుల్లో కంటే ఆ ఆరు రోజులు ఎక్కువ ఆదాయం కొత్తగూడెం డిపోకు రావడం జరిగిందన్నారు. అందులో ఈనెల 14న ఎక్కువ ఆదాయం వచ్చినదని, అందుకు గాను రాష్ట్ర లో ఉన్న అన్ని డిపోలలో ఎం.డి ఆదేశాను ప్రకారం కష్టపడిన కొత్తగూడెం ఉద్యోగ సిబ్బందికి స్వీట్స్ పంచడం జరిగిందని తెలిపారు. కొత్తగూడెం డిపో ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండాలని వారికీ ఈనెల 18 నుండి 21వరకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ గా తీసుకొని వారికి టెస్టులు చేయించడం జరుగుతుందని తెలిపారు. ఆ టెస్టుల్లో ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే వారిని తార్నాక హైదరాబాద్ ఆర్టీసీ హాస్పటల్ కు పంపించడం జరుగుతుంది అని తెలియజేశారు.

